# ప్రజా మాటల
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బంగ్లాదేశ్‌లో మరో హిందువుపై మరో దాడి..
ఉపాధ్యాయుడి ఇంటికి నిప్పు


ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 192  పేజీలు : 04  వెల రూ. 2  శనివారం  17 - 01 - 2026


# ప్రజలు అండగా ఉంటే తెలంగాణను నెంబర్ వన్ చేస్తా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడతాం, ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం
- ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామన్న సీఎం
- జిల్లాలో రూ.386.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కేంద్రం నుంచి రావల్సిన నిధుల కోసమే ప్రధానిని కలుస్తున్నామని ప్రకటన
- రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి
- బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి
- ప్రజలు అండగా ఉంటే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తానన్న సీఎం



హైదరాబాద్ : తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి నిర్మల్‌కే వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే ముఖ్యమంత్రి అయినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మెదటి బహిరంగసభ పెట్టామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అని జల్, జంగల్, జమీన్ అంటూ కుమరంభీం కొట్లాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇచ్చి, పారిశ్రామికంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి - మిగతా 2 లో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ



- హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి
- మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి
- మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర మంత్రి

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు.మెట్రో రెండో దశ నిర్మాణం - మిగతా 2 లో





## ఈ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం యావత్ తెలంగాణకు గర్వకారణం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందన్న కేటీఆర్
- ఈ విధానం ద్వారా రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి
- పదేళ్లలో 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని స్పష్టీకరణ
- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దని ప్రత్యర్థులకు హితవు
- రైతుబంధు, మిషన్ భగీరథలాగే టీఎస్ ఐపాస్‌కు జాతీయ గుర్తింపు లభించిందని వ్యాఖ్య

## జనవరి 20న బీజేపీ నూతన అధ్యక్షుడి ప్రకటన

- రేసులో ముందున్న నబీన్
- ఈ నెల 19న నామినేషన్ల దాఖలు
- ప్రక్రియ ఉంటుందని వెల్లడి
- అదే రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహారణ
- మరుసటి రోజు కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటిస్తామని వెల్లడి





# రాబోయే పదేళ్లలో స్టార్టప్స్ టెక్‌లో అగ్రగామిగా భారత్

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 'స్టార్టప్ ఇండియా' మిషన్‌కు పదేళ్లు పూర్తి
- దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు
- దేశ యువత నిజమైన సమస్యలను పరిష్కరిస్తోందన్న మోదీ
- పదేళ్లలో 500 నుంచి 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు
- 125కు పైగా యూనికార్న్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరిగిందన్న ప్రధాని
- భారతీయ స్టార్టప్‌ల వైవిధ్యంపై నాకు విశ్వాసముంది
- 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ



ఢిల్లీ : భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు.పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన - మిగతా 2 లో

ఫిబ్రవరి 1 ఆదివారం

# కేంద్ర బడ్జెట్ ప్రకటన

- కీలక నిర్ణయం తీసుకున్న స్టాక్ మార్కెట్లు
- కేంద్ర బడ్జెట్ 2026 కారణంగా ఆదివారం కూడా పనిచేయనున్న స్టాక్ మార్కెట్లు
- ఫిబ్రవరి 1న యథావిధిగా ఉదయం 9:15 నుంచి 3:30 వరకు ట్రేడింగ్
- 2000 సంవత్సరం తర్వాత ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి
- జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



ఢిల్లీ : కేంద్ర బడ్జెట్ 2026-27 నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజైన ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం అయినప్పటికీ, ఆ రోజున యథావిధిగా ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) - మిగతా 2 లో





## కాకినాడలో 'ఏఎమ్ గ్రీన్' రూ.83 వేల కోట్ల పెట్టుబడి

- 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా టెర్మినల్
- 8,000కు పైగా ఉద్యోగ అవకాశాలు
- జర్మనీ, సింగపూర్, జపాన్‌లకు గ్రీన్ ఎనర్జీ ఎగుమతి

# 'ఏపీ ఫస్ట్'... తిరుపతిలో అతి పెద్ద రీసెర్చ్ సెంటర్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- తిరుపతిలో 'ఏపీ ఫస్ట్' పేరుతో భారీ పరిశోధన కేంద్రం
- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం
- వ్యవసాయం, వైద్యంలో డ్రోన్ల వినియోగం పెంచాలని సూచన
- ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు.తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత - మిగతా 2 లో

# ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు

- నేడు శంకుస్థాపన చేయనున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
- కాకినాడలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్లాంట్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం
- రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,600 మందికి ఉపాధి అవకాశాలు
- హరిత ఇంధన రంగంలో దేశంలోనే కీలక ముందడుగు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హరిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఒక చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే భారీ పరిశ్రమకు కాకినాడ వేదిక కాబోతోంది. రేపు (జనవరి 17) ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థ సుమారు రూ.13 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాది - మిగతా 2 లో

# సంపాదకీయం

## సంక్రాంతి శోభ.. వీరభద్ర ప్రభ



పూర్వ కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొత్తకొండలో కొలువుదీరిన వీరభద్రుడి జాతర రాష్ట్రంలోని అతి పెద్ద జాతరల్లో ఒకటి. ఇది ప్రతి ఏటా సంక్రాంతి సమయంలో ఘనంగా జరుగుతుంది. లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. భోగి పండుగకు ముందు రోజు రాత్రి 'కొత్తకొండ వీరభద్రస్వామికి శరభ' అనే శరణుఘోషతో పరిసర గ్రామాల ప్రధాన రహదారులు మార్మోగుతాయి. దారి వెంట శివసత్తుల నృత్యాలు చూపు తిప్పుకోనివ్వవు. అందంగా అలంకరించిన ప్రభ బండ్లు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీరభద్రుడికి భోగి రోజున వీరబోనం సమర్పించేందుకు అంతకుముందు రోజు రాత్రే కడిపికొండ, దామెర గ్రామాల నుంచి శాలివాహన (కుమ్మరి) కులానికి చెందిన దామెరుప్పుల వంశీయులు, ఇతర భక్తులు కలిసి కొత్తకొండకు బయల్దేరతారు. స్వామికి వీరబోనం సమర్పించి, సంక్రాంతి ఉత్సవాల అనంతరం కనుమనాడు ఇంటికి తిరుగుముఖం పడతారు. దాదాపు ఏడు శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది.కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు సంబంధించి ఒక ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. 'కాకతీయుల కాలంలో ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని మడికొండ మెట్టుగుట్ట సమీపంలో దామెరుప్పుల వంశానికి చెందిన ఏడుగురు అన్నదమ్ములు నివాసముండేవారు. కలప సేకరణ కోసం వారంతా ఒకనాడు ఎండ్ల బండ్లు కట్టుకుని కొత్తకొండ గుట్ట వద్దకు వెళ్లారు. కలప సేకరణ అనంతరం ఆ అన్నదమ్ములు అక్కడే విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వారి ఎద్దులు ఉన్నట్టుండి కన్పించకుండా పోయాయి. వాటి కోసం వెతికిన అనంతరం అలసటతో వారంతా నిద్రలోకి జారుకున్నారు. వారిలో ఒకరికి వీరభద్రుడు కలలో సాక్షాత్కరించాడు. తాను అక్కడే కొత్తకొండ గుట్టపై కొలువై ఉన్నానని, అంత పైకి భక్తులు రాలేకపోతున్నారని, భక్తుల సౌకర్యార్థం తనను గుట్ట కింద భాగంలో ప్రతిష్ఠించాలని ఆదేశించాడు. ఆ అన్నదమ్ములు నిద్ర నుంచి మేల్కొన్న కొంతసేపటికే వారి ఎద్దులు దొరికాయి. కొత్తకొండ సమీపంలోని ఇతర గ్రామస్థుల సహకారంతో వీరభద్రస్వామి విగ్రహాన్ని గుట్ట కిందకు తీసుకువచ్చారు. అక్కడి చెంచులక్ష్మి ఆలయం వద్ద భద్రకాళీ సమేత వీరభద్రుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.' ఇలా ఎడ్లబండ్లపై వచ్చి, భోగి నాడు వీరభద్రుడికి వీరబోనం సమర్పించే ఆచారం, ఈ సందర్భంగా జరిగే జాతర అప్పటి నుంచే మొదలైందని భక్తులు చెబుతారు. తమ పూర్వీకులు అందించిన సంప్రదాయాన్ని దామెరుప్పుల వంశస్థులు శతాబ్దాల తరబడి కొనసాగిస్తూ వస్తున్నారు. వీరభద్రుడి దర్శనం కోసం జాతరకు ఎడ్లబండ్లు కట్టుకుని వచ్చేవారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. పిల్లల భవిష్యత్తు, చదువు, ఉద్యోగం, పెళ్లి, ఇంటి నిర్మాణం... ఇలా తమ కోరికలు నెరవేరితే, అక్కడ బండి కడతామని భక్తులు వీరభద్రుడికి మొక్కుకుని, అనంతరం తమ మొక్కులు చెల్లించుకుంటారు.ఇంత ప్రసిద్ధి చెందిన కొత్తకొండ జాతరకు వచ్చే భక్తులను మౌలిక వసతులు, సదుపాయాల కొరత వేధిస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చి, అక్కడే మూడు రోజులపాటు బసచేసే భక్తులకు సరైన వసతులు నేటికీ అందుబాటులోకి రాకపోవడం విచారకరం. దేవాదాయ, పోలీసు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనాదిగా కొనసాగుతూ వస్తున్న గర్భాలయ ప్రత్యేక దర్శనాన్ని కూడా నిలిపివేశారు. మరోవైపు, వాహనాలను కొండ పరిసరాల్లోకి అనుమతించకపోవడం, ఒక్కోసారి ఏకంగా ఎడ్లబండ్లను ఆపేయడం వంటివి చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, కొత్తకొండ జాతరకు వచ్చే భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలి. వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలి.

## ఫిబ్రవరి 1 ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రకటన

**మొదటిపేజీ తరువాయి** – ప్రకటించాయి. ఈ మేరకు ప్రత్యేక సర్క్యులర్లను జారీ చేశాయి.ఫిబ్రవరి 1న ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు సాధారణ ట్రేడింగ్ సెషన్ జరుగుతుందని ఎన్ఎస్ఈ తన సర్క్యులర్‌లో పేర్కొంది. ఈక్విటీ సెగ్మెంట్‌తో పాటు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, కమోడిటీ డెరివేటివ్స్ విభాగాల్లోనూ ట్రేడింగ్ ఉంటుందని స్పష్టం చేసింది. అయితే, టి+0 సెటిల్‌మెంట్ సెషన్, ఆక్షన్ సెషన్ మాత్రం ఆ రోజు ఉండవని బీఎస్ఈ తెలిపింది.సాధారణంగా శని, ఆదివారాల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు ఉంటుంది. అయితే, బడ్జెట్ వంటి కీలక ఘట్టం కారణంగా ఈ ప్రత్యేక ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరం తర్వాత బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. గతంలో 2015, 2025 బడ్జెట్‌లను శనివారాల్లో ప్రవేశపెట్టినప్పుడు కూడా మార్కెట్లను తెరిచే ఉంచారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు రెండు విడతలుగా కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. జనవరి 30న ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించిన ప్రకారం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.


## కాకినాడలో 'ఏఎమ్ గ్రీన్' రూ.83 వేల కోట్ల పెట్టుబడి

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడి రాబోతోంది. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 83,000 కోట్లు) పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ఎగుమతి టెర్మినల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 8,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.ఏఎమ్ గ్రీన్ ఏర్పాటు చేయనున్న ఈ టెర్మినల్ ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇక్కడ తయారైన గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్‌ను దాదాపు 7.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం, 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ద్వారా సమకూర్చనున్నారు.అమ్మోనియా రూపంలో గ్రీన్ ఎనర్జీని విదేశాలకు ఎగుమతి చేయడం భారతదేశ చరిత్రలోనే ఇది తొలిసారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ భారీ పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ గ్రీన్ ఎనర్జీ వ్యాల్యూ చెయిన్‌లో అగ్రగామిగా నిలవనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతాన్ని ఇవ్వడమే కాకుండా, హరిత ఇంధన రంగంలో ఏపీకి కీలక స్థానాన్ని కట్టబెట్టనుందని తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**మొదటిపేజీ తరువాయి** – గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.

## జనవరి 20న బీజేపీ నూతన అధ్యక్షుడి ప్రకటన



**మొదటిపేజీ తరువాయి** – బీజేపీ తన తదుపరి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ఎన్నికల ప్రక్రియను అధికారికంగా ప్రకటిం చింది. రాజ్యసభ సభ్యుడు మరియు బీజేపీ జాతీయ ఎన్నికల ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె. లక్ష్మణ్ ఒక అధికారిక ప్రకటనలో సంస్థాగత కసరత్తు కోసం షెడ్యూల్‌ను వెల్లడించారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కోసం జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నాయని, మరుసటి రోజు 20వ తేదీన కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని తెలిపారు. జనవరి 19న మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య నామినేషన్లను దాఖలు చేస్తారని వెల్లడించారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య నామినేషన్ పత్రాల పరిశీలన, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.అదేరోజు సాయంత్రం ఆరున్నర గంటలకు అధికారిక పత్రికా ప్రకటన జారీ చేస్తామని, అనంతరం మరుసటి రోజు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య ఢిల్లీలో కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని లక్ష్మణ్ తెలిపారు.బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఇటీవల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయననే నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని బీజేపీ భావిస్తోందని సమాచారం. యువ నాయకత్వాన్ని తయారు చేసుకోవడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయి. నబీన్ బీహార్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. గతంలో సిక్కిం, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు. డిసెంబర్ 14న ఆయన పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

# 'ఏపీ ఫస్ట్'... తిరుపతిలో అతి పెద్ద రీసెర్చ్ సెంటర్



**మొదటిపేజీ తరువాయి** – స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు. "డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్' వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు అండగా ఉంటే తెలంగాణను నెంబర్ వన్ చేస్తా

**మొదటిపేజీ తరువాయి** – పనులకు శంకుస్థాపనలు చేశారు.మాజీ సీఎం కేసీఆర్ అనుకుంటే పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ లేదని వెంటనే వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బాసర ఐఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్న సీఎం నిర్మల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే, ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామని, ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తామని అన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దామని చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి మోదీని కలుస్తున్నామని, రాష్ట్ర బీజేపీ నేతలు కూడా రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలని కోరారు.అభివృద్ధి, నిధుల కోసం ఎవరినైనా కలవడానికి తాను సంకోచించనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని, అడగాల్సిన ప్రాజెక్టులు అడిగామన్నారు. పదేళ్లపాటు కేంద్రప్రభుత్వాన్ని గత ప్రభుత్వం ఏమి అడగలేదని, అలా చేస్తే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలకులు చేసిన అప్పులు ఉరితాడై ప్రభుత్వం ఊపిరి పోతుందని విమర్శించారు. ప్రధాని మోదీని పదే పదే కలుస్తున్నానని కొంతమంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇచ్చేది కేంద్రం, ప్రధాని కాదా? అని ప్రశ్నించారు. ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి? అని మండిపడ్డారు. నాగోబా జాతరకు రూ.22 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని, సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్ల కేటాయించి పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందని, పెట్టుబడుల కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు సీఎం తెలిపారు. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇస్తే సలహాలు ఇవ్వాలి లేకుంటే ఫామ్‌హౌస్‌లో కూర్చోవాలని పరోక్షంగా విమర్శించారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, మీరందరూ తమ వెంట ఉంటే తెలంగాణను దేశంలోనే నంబర్ 1 చేస్తామని రేవంత్ రెడ్డి కోరారు. ప్రజాప్రభుత్వంతో కలిసి పనిచేసేవారిని గెలిపిస్తే మన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని మీడియాలో వార్తలు వస్తున్నాయని, ఆశావహులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. నిర్మల్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడే ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.అంతకు ముందు ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. భోరాజ్ మండలం హాతిఘాట్‌లో చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.అనంతరం నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ చేరుకున్న సీఎం గోదావరి నదిపై



నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ కుమార్ జాదవ్, వెడ్మ బొజ్జు, సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు ఉన్నారు.బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పిదాల వల్లే గోదావరి నీళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఎక్కువ వరి పంట పండించిందని పేర్కొన్నారు. మిగిలిన సాగునీటి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కోరినట్లు ప్యాకేజీ 27 భూ సేకరణ కోసం రూ.97 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. లక్ష ఎకరాలను సాగులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే ఏపీ ప్రభుత్వం పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతుందని దానికి తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఆ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కూడా పోరాడుతున్నట్లు తెలిపారు.

# ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు

**మొదటిపేజీ తరువాయి** – క్రితమే ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా, ఇప్పుడు ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది.

**ప్లాంట్ విశేషాలు.. వేల ఉద్యోగాలు**

గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ ప్లాంట్ ద్వారా ఏటా 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడలో సుమారు 495 ఎకరాల విస్తీర్ణంలో, గతంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ ఉన్న ప్రదేశంలో ఈ కొత్త ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.2027 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు చేపట్టనున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి, 11:20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, అనంతరం ప్రసంగిస్తారు.

**పర్యావరణ హితం.. ప్రపంచానికి ఎగుమతులు**

బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలతో తయారు చేసే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా, ఈ గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో ఎలాంటి కర్బన ఉద్గారాలు వెలువడవు. పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా తయారయ్యే ఈ ఇంధనం పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించదు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా పెట్టుకున్న ప్రస్తుత తరుణంలో, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.కాకినాడ పోర్టుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ ప్లాంట్ ఉండటం వల్ల, ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు అద్భుతమైన అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఏఎమ్ గ్రీన్ సంస్థ జర్మనీకి



చెందిన యూనిపర్ ఎస్ఈతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది.ఈ ప్రాజెక్టుతో పాటే, కాకినాడలోనే సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో 2 గిగావాట్ల సామర్థ్యం గల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్ జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఐఏ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హరిత ఇంధన పటంలో కీలక స్థానంలో నిలపనుంది.

# రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్‌లో అగ్రగామిగా భారత్

**మొదటిపేజీ తరువాయి** – వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు.ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి.

**అందరినీ కలుపుకొని వృద్ధి**

స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు.ఒకప్పుడు స్టార్టప్‌లను వైఫల్యానికి దారితీసే



మార్గంగా, కేవలం సంపన్నుల పిల్లలకే పరిమితమైనవిగా చూసేవారని, కానీ స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఈ దృక్పథాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు."నా ముందు కొత్తగా ఆవిర్భవిస్తున్న భారత్ భవిష్యత్తు కనిపిస్తోంది" అని స్టార్టప్ వ్యవస్థాపకులను ఉద్దేశించి మోదీ అన్నారు. "మీ కలలే ఈ దేశ ప్రగతికి చోదక శక్తి" అని కొనియాడారు.

**భవిష్యత్ లక్ష్యం తయారీ రంగం**

డిజిటల్ స్టార్టప్‌లు, సేవా రంగంలో మనం అద్భుతమైన విజయం సాధించామని, ఇప్పుడు తయారీ రంగంపై కూడా మన స్టార్టప్‌లు మరింత దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని పిలుపునిచ్చారు."ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతతో కొత్త ఉత్పత్తులను తయారు చేయాలి. సాంకేతికతలోనూ మనం ప్రత్యేకమైన ఆలోచనలతో ముందంజ వేయాలి. మీ ప్రతి ప్రయత్నంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని నేను హామీ ఇస్తున్నాను" అని మోదీ భరోసా ఇచ్చారు. ఈ వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును గుర్తుచేస్తూ, 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్', 'క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్'వంటి పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. జాతీయ స్టార్టప్‌ల దినోత్సవం మన ప్రజల ధైర్యం, ఆవిష్కరణల స్ఫూర్తి, వ్యవస్థాపక ఉత్సాహానికి ప్రతీక అని ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# ఈ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం యావత్ తెలంగాణకు గర్వకారణం

**మొదటిపేజీ తరువాయి** – తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన టీఎస్ ఐపాస్ విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేసీఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని తెలిపారు.కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని కేటీఆర్ గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు.ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్ర దమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు.గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ-హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి చిన్న పరిశ్రమల వరకు తెలంగాణ వైపు చూసేలా పెట్టుబడిదారుల్లో ఈ విధానం కొండంత విశ్వాసాన్ని నింపిందన్నారు. "ఇకనైనా కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే



భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిది" అని పరోక్షంగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ చెప్పిన తర్వాత కూడా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

# డ్రగ్స్ విక్రయించే నైజీరియన్‌కు ఆధార్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్!

**డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్లు అరెస్ట్**

**ఇద్దరు నైజీరియన్లను అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు**

**నిందితుల నుంచి 150 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ స్వాధీనం**

**తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలన్న పోలీసులు**



యువతను మత్తు ఊబిలోకి నెడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టును హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో హెచ్-న్యూ బృందం నిర్వహించిన దాడిలో ఇద్దరు నైజీరియన్ డ్రగ్ సప్లయర్లు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 20 లక్షల విలువైన 150 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నైజీరియాకు చెందిన ఇద్దరు చిడి ఈజెహ్, ఓబసి జేమ్స్ విక్టర్‌గా ఈడ్రగ్స్ దందాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడైన చిడి ఈజెహ్ పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. 2014లో మెడికల్ అటెండెంట్ వీసాపై భారత్‌కు వచ్చి వీసా గడువు ముగిసినా అక్రమంగా ఇక్కడే ఉండిపోయాడని పోలీసుల విచారణలో తెలింది. తన అసలు పేరును దాచిపెట్టి నాగేశ్వరన్ అనే భారతీయ పేరుతో నకిలీ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్‌లను సృష్టించుకున్నాడు. ఈ నకిలీ గుర్తింపుతోనే దేశంలో యథేచ్ఛగా తిరుగుతూ డ్రగ్స్ వ్యాపారం సాగిస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది.ప్రధాన నిందితుడు చిడిఈజెహ్ గతంలోనూ పలు డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడని పోలీసుల విచారణలో తెలింది. 2019లో గోల్కొండ ఎక్సైజ్ పోలీసులు 130 గ్రాముల కొకైన్, 32 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏతో ఇతనిని అరెస్ట్ చేశారు. అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేసులో ఇతను తప్పించుకుని తిరుగుతున్నాడు. గోవాలో కూడా ఇతనిపై డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన ప్రతిసారీ తన నివాసాన్ని, గుర్తింపును మారుస్తూ మళ్లీ మత్తు వ్యాపారంలోకే దిగుతున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైందని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ వెల్లడించారు. నిందితులు ఢిల్లీ కేంద్రంగా తమ నెట్‌వర్క్‌ను నడుపుతున్నారని టాస్క్ ఫోర్స్ డీసీపీ తెలిపారు. ఢిల్లీలో నివసించే క్రిస్ అనే మరో నైజీరియన్ నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ సేకరించి హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లోని పెడ్లర్లకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని పోలీసుల విచారణలో తెల్చారు. నిందితుల్లో ఒకరైన ఓబసి జేమ్స్ విక్టర్ ఢిల్లీలో ఒక ఆఫ్రికన్ రెస్టారెంట్ నడుపుతూ, చిడి ఈజెహ్‌తో కలిసి డ్రగ్స్ డెలివరీ బాధ్యతలు చూసుకుంటున్నట్లు విచారణలో తెలిందని డీసీపీ వెల్లడించారు. వీరు వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని, నేరుగా వచ్చి డ్రగ్స్‌ను చేరవేస్తుంటారని దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు.ప్రస్తుతం నిందితులిద్దరి వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినట్లు పోలీసులు గుర్తించారు. వీరు అక్రమంగా దేశంలో నివసిస్తూ నేరాలకు పాల్పడుతున్నందున, వీరిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచి, మళ్లీ భారత్‌లోకి రాకుండా నిషేధించనున్నారు. ఓబసి జేమ్స్ విక్టర్‌ను ఎంబసీ, ఎఫ్‌ఆర్ఆర్ఓ అధికారుల సహకారంతో వెంటనే నైజీరియాకు డిపోర్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించామని డీసీపీ వెల్లడించారు. చిడి ఈజెహ్‌పై ఉన్న పాత కేసుల దృష్ట్యా చట్టపరమైన విచారణ కొనసాగుతోందన్నారు. మెడికల్, స్టూడెంట్ వీసాలపై భారత్‌కు వచ్చే కొంత మంది విదేశీయులు అక్రమ దందాలకు పాల్పడుతున్నారని డీసీపీ వైభవ్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని కోరారు. నగరంలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 8712661601 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేషనల్ హైవేలపై ప్రతి కిలోమీటరుకు ఓ కెమెరా

**ఎక్కడ ప్రమాదం జరిగినా ఇట్టే తెలిసేలా ఏర్పాటు**

**జాతీయ రహదారులపై ప్రతి కిలోమీటరు దూరానికి ఒక కెమెరా చొప్పున ఏర్పాటు**

**ప్రమాదాలు జరిగిన మరుక్షణం కంట్రోల్ రూమ్‌కు సమాచారం**

**ఆరేడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని జాతీయ రహదారులపై ఏర్పాటు**



ఇకపై జాతీయ రహదారులపై నిఘా పెంచనున్నారు. ప్రమాదం ఎక్కడ సంభవించినా, అతివేగంతో వాహనాలు నడిపినా క్షణాల్లో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఏఐ దేశవ్యాప్తంగా దీనిని అమలు చేసేందుకు కసరత్తులు చేస్తోంది. రాష్ట్రంలో ముందుగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి 44వ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు, ఆర్చిలను ఏర్పాటు చేసే పనులు ముమ్మరం చేస్తోంది. ఈ ప్రాంతంలో పనులు పూర్తయిన తరువాత హైదరాబాద్ – విజయవాడ సహా తెలంగాణలోని అన్ని జాతీయ రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు కానున్నాయి.జాతీయ రహదారులపై ప్రతి కిలోమీటరు దూరానికి ఒక కెమెరా చొప్పున ఏర్పాటు చేయనున్నారు. డ్రైవర్ల సౌలభ్యం కోసం ఓవర్ హెడ్ ఆర్చిలను నిర్మించి ఆయా గ్రామాలు, పట్టణాల పేర్లు, ఎంత దూరంలో ఉన్నాయి అనే వివరాలను ప్రదర్శించనున్నారు. ఆరేడు నెలల్లో ఈ వ్యవస్థ రాష్ట్రంలోని అన్ని జాతీయ రహదారులపై అందుబాటులోనికి వచ్చే అవకాశం ఉంది.ఈ సీసీ కెమెరాల సహాయంతో కంట్రోల్ రూమ్‌లో నిరంతరం నిఘా కొనసాగుతుంది. ప్రతి టోల్‌ప్లాజా వద్ద ఒక రూమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. కెమెరాల కారణంగా రోడ్డుపై ప్రమదాలు జరిగితే తక్షణమే కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుంది. సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి ఓవర్ హెడ్ ఆర్చిలు సౌకర్యంగా ఉంటాయి. వీటి సాయంతో అత్యధిక ఎత్తు లోడ్‌తో వెళ్లే వాహనాలను నిలువరించవచ్చు. ఎక్కడైనా వాహనం ప్రమాదానికి గురైతే తక్షణమే సీసీ కెమెరాల ద్వారా తెలిసిపోతుంది. జాతీయ రహదారుల పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని సత్వర సాయం అందించేందు సహాయపడుతుందని అధికారులు అంటున్నారు.ప్రగతి పథాలుగా రహదారులు : కాగా వాహనాలపై ప్రయాణించే వారు సైతం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించక పోవడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. వీటి కారణంగానే అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు భద్రత అనేది ఒక్కరితో ముగిసేది కాదు రహదారులకు అధికారులు మరమ్మతులు చేపట్టాలి. నియమ నిబంధనలను పోలీసులు కఠినతరం చేయాలి. అయితే వీటన్నింటికన్నా మిన్నాగ వాహనదారులు ఇంటికి సురక్షితంగా చేరుకోవాలి అనే సంకల్పం కలిగి ఉండాలి. అప్పుడే రహదారులు మృత్యుపాశాలు కాకుండా ప్రగతి పథాలుగా మారుతాయి. ప్రతి ప్రాయాణం క్షేమంగా మారినప్పుడే ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నం సంపూర్ణం అవుతుంది. పౌరులు సైతం క్రమశిక్షణతో రహారారి భద్రత నియమాలను పక్కాగా పాటించాల్సిన అవసరం ఉంది.తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో రహదారి భద్రత కీలకం కానుంది. రోడ్డు ప్రమాదంలో మరణాల్ని సున్నాకు తగ్గించాలన్న ప్రధాన లక్ష్యాన్ని రవాణాశాఖ కలిగి ఉంది. అందుకోసం విజన్ – 2047 ప్రణాళిక రూపొందించింది. పరిశ్రమలు, వాహనదారులు, లాజిస్టిక్ రంగాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. ఈ విధానం అమల్లోకి వస్తే రాష్ట్రంలో సురక్షితంగా, స్మార్ట్‌గా ప్రయాణాలు చేయవచ్చు.రోడ్లపై నిత్యం నియమ నిబంధనలు పాటించకుండా కొందరు, అనుకోకుండా ప్రమాదాలు జరిగి మరికొందరు మరణిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబాల్లో తీరని విషాధాన్ని మిగుల్చుతున్నారు. దీంతో వారి కుంటుంభానికి సామాజిక, ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారు. తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 22,000 నుంచి 23,000 రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వటిలో 7,500 నుంచి 7,800 మంది మరణిస్తున్నారు. 4,40,000 మందికి పైగా గాయాలపాలవుతున్నారు.

# ఘనంగా ముగిసిన కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

**3 రోజుల్లో 3 లక్షల మంది సందర్శన**

**పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు ఘనంగా జరిగిన కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్**

**లక్షలాదిగా తరలివచ్చిన సందర్శకులు**

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డ్రాగన్, ఈగిల్, షార్క్ కైట్లు**



హైదరాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు నగరవాసులను ఆహ్లాదపరిచిన ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ గురువారం ఘనంగా ముగిసింది. 'సెలబ్రేట్ ది స్కై' థీమ్‌తో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి లక్షలాది మంది సందర్శకులు తరలివచ్చారు. దేశ విదేశాల నుంచి వచ్చిన కైట్ ఫ్లయర్స్, వేల రకాల స్వీట్లు, హ్యాండ్‌లూమ్, హ్యాండ్‌క్రాఫ్ట్ స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో పరేడ్ గ్రౌండ్స్ మూడు రోజులు పండుగ వాతావరణంతో కళకళలాడింది.హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ చివరి రోజున (గురువారం) సందర్శకులతో కిటకిటలాడింది. గడిచిన మూడు రోజుల్లో 3 లక్షల మందికి పైగా ఫెస్టివల్‌ను సందర్శించినట్లు అధికారులు అంచనా వేశారు. 19 దేశాల నుంచి వచ్చిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, 15 రాష్ట్రాల నుంచి వచ్చిన 55 మంది కైట్ ఫ్లయర్స్ తమ ప్రత్యేక ఆకృతుల కైట్లతో ఆకాశాన్ని రంగుల మయం చేశారు. డ్రాగన్, ఈగిల్, షార్క్, క్రొకోడైల్, పూల ఆకృతుల్లోని భారీ కైట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మరోవైపు 60 స్టాళ్లలో ఏర్పాటు చేసిన 1,200 రకాల సంప్రదాయ స్వీట్లు రుచుల పండుగగా మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, బెంగాల్, మహారాష్ట్రతో పాటు విదేశీ స్వీట్లు కూడా అందుబాటులో ఉండటంతో ఫుడ్ స్టాళ్ల వద్ద ఎప్పుడూ రద్దీ కనిపించింది. అలాగే 120 హ్యాండ్‌లూమ్, హ్యాండ్‌క్రాఫ్ట్ స్టాళ్లలో స్థానిక కళాకారుల ఉత్పత్తులు, వస్త్రాలు, హస్తకళా వస్తువులు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాల్లో జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు ఉత్సవానికి మరింత వైభవాన్ని తెచ్చి పెట్టాయి.చివరి రోజు భారీ జన సందోహం ఏర్పడటంతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు. సంక్రాంతి అంటే ఒకప్పుడు ఏపీలో బాగా జరుపుతారని అనుకునేవారమని, కానీ ఇప్పుడు హైదరబాద్ సంక్రాంతి సంబురాలకు కేరాఫ్‌గా మారిందని ప్రజలు అంటున్నారు. మరీ ముఖ్యంగా పిల్లలు భిన్న పతంగులు ఒకేచోట ఉండటంతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు ఎంతో సంబురంగా జరిగిన ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ గురువారంతో విజయవంతంగా ముగిసింది. కైట్లు, స్వీట్లు, కళలు, సంస్కృతి అన్నింటి సమ్మేళనంగా సాగిన ఈ వేడుక నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్ మదాపూర్ శిల్పారామంలో నిర్వహిం చిన సంక్రాంతి వేడుకల్లో నగర ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చుట్టూ పచ్చని చెట్లు, ఎడ్లబండ్లు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, తుపాకిరాముడి మాటలు భాగ్యనగర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామీణ వాతావరణం కళ్లకు కట్టినట్లు ఏర్పాటు చేసిన వారాంతపు సంత, మన పండుగల ప్రత్యేకతలు తెలియజేసే శిల్పాలు చూసి పిల్లలు ముగ్ధులయ్యారు. సంక్రాంతిని పురస్కరిం చుకుని అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల్లో యువత ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. బల్కంపేట్ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కూకట్‌పల్లి ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియాలో సీతశాస్త్రి కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన అరుదైన బొమ్మలు కొలువులో దర్శనమిచ్చాయి.

# పూర్తయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి

**సాఫీగా ప్రయాణం , గతంలో వాహనదారులకు తప్పని ఇక్కట్లు**

**హైదరాబాద్ నుంచి బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి అనంతపురం**

**చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారికి రాప్తాడు ఆర్వోబీ ఎంతో కీలకం**



రాప్తాడు మీదుగా అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు వెళ్లాలంటే ఒకప్పుడు అందరిలోనూ ఒకింత అసహనం ఉండేది. రాప్తాడు రైల్వేగేటు పడితే పడిగాపులే అన్న భయం వెంటాడేది. అరగంటపాటు అక్కడే ట్రాఫిక్ నిలిచిపోయేది. డబుల్ ట్రైన్ వచ్చినప్పుడు ఈ మార్గంలో వాహనదారుల సహనానికి పరీక్షలా ఉండేది. వాహనదారులకు ఈ మార్గం చికాకు కల్గించేది. జాతీయ ఉపరితల రోడ్డు రవాణా సంస్థ మంజూరు చేసిన ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం పూర్తి కావడంతో ప్రస్తుతం ప్రయాణం సాఫీగా సాగిపోనుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈ ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇక వాహనదారులు ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా ఈ మార్గంలో ప్రయాణించవచ్చు.గతంలో నేషనల్ హైవే 44 మీదుగా బెంగుళూరు, హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు పంగల్ రోడ్డు మీదుగా వెళ్లేవి. అక్కడి నుంచి చెన్నై నేషనల్ హైవే, అనంతపురం నగరంలోకి వెళ్లాలంటే రాప్తాడు రైల్వే గేటు తప్పనిసరిగా దాటాలి. చెన్నై హైవే నుంచి వచ్చే వాహనాలు హైదరాబాద్, బెంగుళూరు వెళ్లాలంటే ఈ రైల్వే గేటు దాటాల్సిందే. ఈ క్రమంలో బస్సులు, లారీలు, పెద్ద వాహనాలు, ఏ వాహనాలైనా ఈ రైల్వే గేటు దాటుకుని వెళ్లాల్సిందే. అయితే రైలు వచ్చే సమయంలో గేటు వేస్తే పెద్దఎత్తున వాహనాలు ఇరువైపులా ఆగిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్వోబీ పనులు సరిగ్గా జరగకపోవడం వల్ల కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురైన పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అటువంటి సమస్యకు, ప్రమాదాలకు తావు లేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పుర్తయ్యాయి. ఇక వాహనదారులు ఈ మార్గంలో సాఫీగా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు.హైదరాబాద్ నుంచి బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి అనంతపురం – చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారికి రాప్తాడు ఆర్వోబీ ఎంతో కీలకంగా మారింది. 2018లో టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి రూ.54.78 కోట్లతో ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారుడిని వైఎస్సార్సీపీ నాయకులు కమీషన్లు డిమాండ్ చేయడంతో గుత్తేదారుడు పనులు అక్కడికక్కడ నిలిపివేసి వెళ్లిపోయాడు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి. దీనితో పిల్లర్ల దశలోనే నిర్మాణ పనులు అన్నీ ఆగిపోయాయి.గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో దాదాపు మూడేళ్లపాటు రీ టెండర్ నిర్వహించకపోవడంతో పనులు అన్నీ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ తీసుకొని ఈ నిర్మాణానికి రీ టెండరు నిర్వహించారు. రూ.24 కోట్లకు పనులు దక్కించుకున్న శ్రీకృష్ణదేవరాయ సంస్థ గుత్తేదారు 2025 ఆగస్టులో ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ నిర్మాణ పనులు తొమ్మిది నెలల వ్యవధిలోపు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఈ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి, సర్వీసు రోడ్లు, కందుకూరు రోడ్డులో జంక్షన్ నిర్మాణ పనులు మాత్రమే మిగిలాయి. ఇది కూడా పూర్తయితే రెండు జాతీయ రహదారులకు ఈ మార్గం ఎంతో ఉపయోగపడనుంది. ఆర్వోబీపై జనవరి నెలాఖరున రాకపోకలు సాగించేలా పనులు పూర్తి చేశామని జాతీయ రహదారుల విభాగం ఏఈ లక్ష్మీనరసయ్య తెలిపారు.

# ఏఐ సాంకేతికతతో పోలీసింగ్




పోలీసింగ్‌లో వ్యవస్థలో ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత సాంకేతికతలను వినియోగించుకుంటూ ఎన్టీఆర్ (విజయవాడ) కమిషనరేట్ మంచి ఫలితాలు సాధిస్తోంది. నేర నియంత్రణ, పరిశోధన, ఛేదన, ట్రాఫిక్ నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సహా అనేక అంశాల్లో ఈ సాంకేతికతను పోలీసులు ఏడాదిన్నరగా విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు వీటిని ప్రవేశపెట్టారు.అస్త్రం (యాక్షన్‌బుల్ ఇంటెలిజెన్స్ ఫర్ సస్టైన్‌బుల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్): నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, నిర్వహణకు 'అస్త్రం' పేరిట ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఏ సమయంలో ఏయే ప్రాంతాల్లో ఎంత ట్రాఫిక్ రద్దీ ఉందో, కారణాలేమిటో రియల్‌టైంలో గుర్తిస్తారు. ఆ మేరకు ట్రాఫిక్ సిబ్బందికి అప్రమత్తత సందేశాలు వెళ్తుంటాయి. వాటి ఆధారంగా రద్దీని నియంత్రిస్తున్నారు.'అస్త్రం' యాప్‌ను 2024 అక్టోబరు నుంచి వాడుతున్నారు. అప్పట్లో నగరంలోని 83 ట్రాఫిక్ కూడళ్ల పరిధిలో సగటు ట్రాఫిక్ కంజెషన్ పొడవు రోజుకు 97 కి.మీ. మేర ఉండేది. గతేడాది నవంబరుకు అది 48 కి.మీ.కి తగ్గింది.ముందస్తు ప్రణాళిక: హిస్టారికల్ డేటా, ఈవెంట్స్, వీఐపీ పర్యటనలు, వాతావరణ వివరాల ఆధారంగా రాబోయే వారం రోజుల్లో ట్రాఫిక్ ఎలా ఉండబోతోందో అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. 'వై ఐయామ్ స్టక్' పేరిట ప్రజలకు యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏ కారణంతో వారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారో, క్లియర్ అవడానికి ఎంత సమయం పడుతుందో యాప్‌లో తెలుసుకోవచ్చు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు రిజిస్టర్ చేసుకుంటే 'ఈ-పాథ్ ఎమర్జెన్సీ వెహికల్ ప్రయారిటీ' పేరిట గ్రీన్ ఛానెల్ ఇస్తారు.చోరీలు, దోపిడీలు తదితర నేరాల ఛేదనలో ఇవి కీలకమయ్యాయి. గతేడాది 816 కేసులు నమోదు కాగా, 596(73 శాతం) ఛేదించారు. ఈ కేసుల్లో బాధితులు రూ.13.89 కోట్లు పోగొట్టుకోగా, రూ.11.21 కోట్లు(80.70 శాతం) రికవరీ చేయగలిగారు. దేశంలో ఏ యూనిట్‌లోనూ ఇంత రికవరీ లేదని, ఇది రికార్డని అధికారులు చెబుతున్నారు. ఎక్కడ నేరం జరిగినా నిందితుల ఉనికి కనీసం నాలుగైదు కెమెరాల్లో చిక్కుతోంది. దీనివల్ల నేరాల ఛేదన, రికవరీ మెరుగుపడింది.ఆలయాలు, ప్రార్థన మందిరాల్లో తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా సమూహ నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్) కోసం రియల్‌టైం మౌంటింగ్ కెమెరాల్ని వినియోగిస్తున్నారు. పర్వదినాలు, జాతరలు, ఉత్సవాల్లో ఆలయాలు, ప్రార్థన మందిరాలకు వచ్చే వాహనాలు, మనుషుల్ని ఈ కెమెరాలు ఏఐ సాయంతో రియల్‌టైంలో లెక్కిస్తాయి. దాని ఆధారంగా అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపడుతున్నారు.గతేడాది దుర్గగుడి దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల విరమణ సమయాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేశారు. అవాంఛనీయ ఘటనలు లేకుండా, ఒకేసారి రద్దీ పెరగకుండా చూశారు. ఆలయం వద్ద ఏ సమయంలో భక్తుల రద్దీ ఎంత ఉంది? అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుంది? క్యూలైన్లలో ఇంకా ఎంతమంది ఉన్నారు? తదితర వివరాల్ని కచ్చితంగా అంచనా వేయగలిగారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగానూ దీన్ని వినియోగించారు. నగరంలోని 200కు పైగా ఆలయాల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు.బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు సహా ఇతర కీలక ప్రాంతాల్లో 126 ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు(ముఖాలను గుర్తించగలిగే కెమెరాలు) ఏర్పాటు చేశారు. సీసీటీఎన్ఎస్ డేటాబేస్‌లోని 1.30 లక్షల మంది పాత నేరగాళ్ల చిత్రాలు, వారి వివరాలను వాటితో అనుసంధానించారు. నగరంలో పాత నేరగాళ్లు తిరుగుతూ కెమెరాల్లో చిక్కితే ఫేషియల్ రికగ్నిషన్ సెంటర్‌కు అప్రమత్తత సందేశం వస్తోంది. దాని ఆధారంగా వారిపై నిఘా పెడుతున్నారు.గతేడాది అక్టోబరు నుంచి దీనిని అమలు చేస్తున్నారు. దసరా ఉత్సవాల సమయంలో పాత నేరగాళ్ల కదలికల్ని గుర్తించి వారిని పట్టుకున్నారు. పలు కీలక కేసుల ఛేదనలో ఈ వ్యవస్థ ఉపయోగపడింది. అదృశ్యమైన(మిస్సింగ్) వారి ఫొటోలను ఈ డేటాబేస్‌కు అనుసంధానించి, ఆచూకీ కనిపెడుతున్నారు. బందోబస్తు ప్రణాళిక రూపకల్పన, సిబ్బందికి విధుల కేటాయింపు గతంలో మ్యాన్యువల్‌గా చేసేవారు. దీనికి కనీసం 2-3 రోజుల సమయం పట్టేది. ఈ-డిప్లాయ్‌మెంట్ వల్ల ఇప్పుడు 6 గంటల్లోపే ప్రక్రియ పూర్తవుతోంది. సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్లకు వెళ్లిన వెంటనే క్యూఆర్, జియో ఫెన్స్‌డ్ ఆధారిత హాజరు పడిపోతోంది.డ్రోన్ పోలీసింగ్‌లో భాగంగా స్టేషన్‌కు ఒకటి చొప్పున 42 డ్రోన్లు ఇచ్చారు. వీటి ద్వారా తీసే దృశ్యాల విశ్లేషణ పర్యవేక్షణకు డ్రోన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పేరిట డ్యాష్‌బోర్డు అభివృద్ధి చేశారు. కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన 10 వేల కెమెరాల్ని డ్యాష్‌బోర్డుకు అనుసంధానించారు. దీనిద్వారా అవి సరిగ్గా పనిచేస్తున్నాయా, లేదా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా కెమెరా పనిచేయకపోతే వెంటనే అప్రమత్తత సందేశం వస్తుంది. అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. ట్రయల్ రన్ చేసి ప్రాజెక్టును సిద్ధం చేశారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నారు.పోలీసింగ్‌లో కృత్రిమ మేధను మరింత విస్తృతంగా వినియోగిస్తామని విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. దాని ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలనేదే లక్ష్యమని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో 'విజిబుల్ పోలీసింగ్ ఇన్‌విజుబుల్ పోలీస్' గా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే అమలవుతున్న వాటికి ఈ ఏడాది మరిన్ని అదనపు అంశాలు జోడించి సేవలు విస్తరిస్తామని వెల్లడించారు.

# సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా

రంగురంగుల రంగవల్లులూ, భోగి మంటలూ, భోగి పండ్లూ, హరిదాసుల సంకీర్తనలూ, గొబ్బెమ్మలూ, గంగిరెద్దులూ, గాలిపటాలూ, కోడి పందేలు, నోరూరించే పిండి వంటలు, పొట్టేళ్ల పందేలు వీటితో పాటు బొమ్మల కొలువులు అన్నీ కలిస్తేనే పెద్ద పండుగ. అదే సంక్రాంతి. సంవత్సరం తొలినాళ్లలో పవిత్ర ధనుర్మాసంలో మూడు రోజుల పాటు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ ఇది.బాపట్ల జిల్లా చీరాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. దేశ విదేశాల నుంచి సొంత ఊళ్లకు వచ్చిన వారితో లోగిళ్లు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. నగరంలో ఓ కుటుంబం ప్రతి ఏటా బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. అసలు ఎవరు వారు? వారి ప్రత్యేకత ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.బొమ్మల కొలువు ఏర్పాటు : బాపట్ల జిల్లా చీరాలలోని వైకుంఠపురంలో కొణికి వారి ఇంట ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొణికి చంద్రశేఖర్, సావిత్రీదేవి, వీరి ముగ్గురు కుమార్తెలు సుష్మ, శ్రావ్య, వైష్ణవి ప్రతి ఏటా అందమైన బొమ్మల అలంకారంతో బొమ్మల కొలువును ఇక్కడ నిర్వహిస్తున్నారు. ముంగిట్లో ఓ పక్కన పల్లె సౌందర్యం, రైతుల శ్రమైక జీవితం, పండుగ విశేషాలకు అద్దంపట్టే అందమైన బొమ్మలను కొలువుతీర్చి పిల్లలకు మన సంప్రదాయాలతో పాటు విలువలను చెప్పకనే చెబుతున్నారు.విశేషంగా ఆకర్షిస్తున్న కొణికి వారి బొమ్మల కొలువు చూడముచ్చటగా కనువిందు చేస్తోంది. ప్రతి ఏటా వీరి ఇంట కొలువు తీరిన బొమ్మల కొలువు రమణీయత ఉట్టిపడే అద్భుత సంబరంగా మారింది. వందలాది బొమ్మలు సేకరించి ఆ ఇంట ప్రదర్శించటం అనవాయితీగా వస్తుంది. సంక్రాంతి పండగ దినాల్లో ప్రత్యేక ఆకర్షణీయమైన బొమ్మల కొలువు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు.సంక్రాంతిలో కనిపించే ఈ సంస్కృతికి తమ తాతల కాలం నుంచి బొమ్మల కొలువుకు శ్రీకారం చుట్టామంటున్నారు. ఈ బొమ్మల కొలువులో వివిధ రకాల మట్టి బొమ్మలు, రామాయణం, భారతం, వివాహ వ్యవస్థ తెలిపే ఘట్టాలు, వివిధరకాల దేవుళ్ల బొమ్మలు చూడముచ్చటగా కొలువుతీరాయి. విహారయాత్రకు వెళ్లిన ప్రతిసారి కొన్నిబొమ్మలు తీసుకురావటం, అనేక బొమ్మలను సేకరించడం, ఇంట్లో ప్రదర్శనగా ఉంచటం చేస్తున్నారు. ఒకప్పుడు కొన్ని బొమ్మలతో ప్రారంభించిన ఈ బొమ్మల సేకరణ ప్రస్తుతం దాదాపు 1500 వరకు బొమ్మల వరకు కొలువుతీరాయి.ప్రకృతి రమణీయతను ఉట్టిపడే అందాలు, ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, అంధంగా కనిపించే రమణీయ దృశ్యాలు, దేవాలయాలు, పంచతంత్రం కథలు తెలిపే బొమ్మలు, దేవుళ్ల బొమ్మలు, పల్లె వాతావరణం ప్రతి బింబించేలా దృశ్యాలు, అందమైన బొమ్మలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు తెలియచెప్పేందుకు బొమ్మల కొలువు తీర్చిదిద్దామని తెలిపారు. సంక్రాంతి పండుగకు ఐదు రోజుల ముందు నుంచే ఎంతో శ్రమించి బొమ్మలను వరుసగా అమరుస్తామని చెప్పారు.ప్రతి ఏటా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలలో బొమ్మలు ప్రదర్శిస్తున్నామని, బొమ్మలు అమర్చటం, దాని తరువాత జాగ్రత్తగా దాచిపెట్టటం కష్టమైనాసరే తెలుగు సంప్రదాయాలను ముందు తరాలకు చాటి చెప్పటం తమ ఉద్దేశ్యమని వారు పేర్కొన్నారు. వందల మంది బొమ్మల కొలువును పురప్రజలు తిలకిస్తుంటే తాము పడ్డ శ్రమను మర్చిపోతామని కొణికి కుటుంబం తెలిపారు. బొమ్మల కొలువును తిలకించేందుకు పెద్దయెత్తున చుక్కుపక్కలవాళ్లు, చీరాల పట్టణంలోని ప్రముఖులు హాజరై హర్షం వ్యక్తం చేశారు. పురాణాలు, ఇతిహాసాలు తెలిసే విధంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు."తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు తెలియచెప్పేందుకు బొమ్మల కొలువు తీర్చిదిద్దాం. ఈ సంస్కృతిని మా తాతల కాలం నుంచి కొనసాగిస్తున్నాం. సంక్రాంతి పండుగకు ఐదు రోజుల ముందు నుంచే ఎంతో శ్రమించి బొమ్మలను వరుసగా ఏర్పాటుచేస్తాం. ప్రతి ఏటా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలలో బొమ్మలు ప్రదర్శిస్తున్నాం, బొమ్మలు అమర్చటం, దాని తరువాత జాగ్రత్తగా దాచిపెట్టటం కష్టమైనాసరే తెలుగు సంప్రదాయాలను ముందు తరాలకు చాటి చెప్పడమే మా ఉద్దేశం. అనేక మంది వచ్చి బొమ్మల కొలువును తిలకిస్తుంటే మేం పడ్డ శ్రమను మర్చిపోతాం.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com